

# కథా కౌముది

## తెరిచిన కిటికి

బి.నర్సన్



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

ఆదివారం రోజు బ్రేక్ ఫాస్ట్ అయ్యాక వినోద్ తీరిగ్గా డైలీ పేపర్ సండే బుక్ తిరిగేస్తూ కథ దగ్గర ఆగాడు.

కథ పేరు తొలగిన మబ్బులు. ఆసక్తిగా ఆయన కళ్ళు కిందకి వెళ్లాయి.

కథ సంభాషణతో మొదలైంది ఇలా.

'మనం అమ్మాయి మాటలు నమ్మి ఊర్లో ఉన్న ఇల్లు అమ్మేసి డబ్బులీయడం తప్పయిపోయింది సుశీలా!' అన్నాడు పడక కుర్చీలో కూర్చుంటూ భీమారావు.

'నేను ఎంత చెప్పినా మీరే వినలేదు. ఉన్న ఒక్క అమ్మాయికి కాకపోతే మన ఆస్తి ఇంకెవరికి అన్నారు కదా!' అంటూ ప్లేట్లో ఉప్మా వేసుకొని వచ్చి ఆయన ముందున్న ప్లాస్టిక్ కుర్చీలో కూచుంది సుశీల.

'మేము హైదరాబాద్ లో ఉండగా మీరు అంత దూరాన ఊర్లో ఉండడమెందుకు. ఇక్కడికి వచ్చేస్తే అందరం కలిసి ఉండొచ్చని అంటే భ్రమసిపోయాను కానీ ఇలా జరుగుతుందని అనుకోలేదు' అన్నాడు భీమారావు తల నిమురుకుంటూ.

'ఇంటి డబ్బుతో అక్కడ మనమే ఓ చిన్న ఫ్లాట్ తీసుకొని రాకపోకలు సాగిస్తే సరిపోయేది. మన తరవాత అది వారిదే అయేది. వెనుక ముందు చూడకుండా మొత్తం ముప్పై లక్షలు తీసికెళ్ళి అల్లుడి చేతిలో పోసి, నా అంత గొప్ప

మామే లేదన్నట్లు పోజు పెట్టారు. ఆర్నెల్లకే అసలు రంగు బయటపడింది' అంటూ  మిరపకాయను చెంచాతో ప్లేటు చివరకు జరుపుతూ.

కోటి రూపాయల ఫ్లాట్ తక్కువకు దొరుకుతోంది. ఇప్పుడే బుక్ చేసుకుంటే ఇరువై లక్షలు తగ్గిస్తారు. నాలుగు బెడ్ రూముల పోర్షన్. ఒక దాన్లో మీరు హాయిగా జీవితం గడపొచ్చు.అందరం ఒక్క చోట ఉంటే ఓల్డ్ ఏజ్ లో మీకు సౌకర్యంగా ఉంటుంది. మీ అల్లుడికి యాభై లక్షలు బ్యాంక్ లోన్ దొరుకుతోంది. అయితే అర్జెంటుగా ఇరువై లక్షలు డౌన్ పేమెంట్ చేయాలి అని అమ్మాయి అనగానే ఇంటి కాగితాలు కుదువబెట్టి డబ్బు సర్దక తప్పలేదు కానీ ఇలా అవుతుందని కలగంటామా!' అని చేతులు నులుముకున్నాడు.

'అంతటితో ఊర్కుంటే ఎలాగోలా ఇల్లు కాపాడుకొనేవాళ్ళం కదా!' అంది పెదవి విరుస్తూ.

'ఫ్లాట్ రెడీగా ఉంది కానీ ఇంటీరియర్ వర్క్ ఆగిపోయింది. అందులోకి పోలేక అనవసరంగా నెలకు పాతిక వేలు కిరాయి కట్టవలసి వస్తోంది అని అమ్మాయి నాల్రోజులకోసారి గొణిగే సరికి వింటూ ఉండలేక మరో పది లక్షలు తెచ్చి ఇవ్వక ఏంచేయాలి మరి! డబ్బులిచ్చాక అమ్మాయి ఏమందో తెలుసా.. ఆరు నెలల్లో మీరు హైదరాబాద్ కి వచ్చేస్తారు పర్మనెంట్ గా ఇక్కడే ఉంటారు అని. కానీ వెళ్ళాక రెణ్ణెల్లయినా గడవక ముందే గడప దాటుతామని అప్పుడే ఎలా తెలుస్తుంది' అని విచారంగా భార్య ముఖంలోకి చూశాడు.

'మా అమ్మాయి రమ్మంటోందని గంతులేస్తూ అందరికి చెప్పి ఉన్న ఇంటిని అమ్మేసి, ఇచ్చేవాళ్లకు ఇచ్చేసి వెళ్తే రంగు హంగుల ఫ్లాట్ బతుకు నవ్వులపాలాయే' అంటూ ఖాళీ ప్లేటును కింద పెట్టింది.

'నమ్మి నానబోసినం. ఇట్లయితదని ముందే తెలుస్తుందా. అయినా నీకు చెప్పే చేశాను కదా. ఇప్పుడేమో అన్నీ నా మీదికి తోసేస్తున్నావ్!'  అంటూ కళ్లు చిట్లించాడు భీమారావు.

'నేనేమంటి.. ఇంట్లో ఉండే ఆడదాన్ని. మగాళ్లకే కదా లోకం తీరు తెలిసేది. ఎదిగిన పిల్లలతో జాగ్రత్తగా ఉండాలి అని ఎందరికో చెప్పినా మీరే కుడితిలో పడ్డారు' అంది వంట గదిలోకి వెళ్లేందుకు లేస్తూ.

'నీవు తొందరపడకన్నది నిజమే కానీ చూస్తూ ఉండలేము కదా!' అని వెళ్తున్న ఆమెతో ఏం మాట్లాడాలని ఊర్కున్నాడు.

'మీకు ఇంత పించను వస్తుంది కాబట్టి ఒడ్డెక్కినాం కానీ..' అని మాట పూర్తి చేయకుండానే సుశీల ముందుకెళ్లింది.

పుస్తకంలో ఈ సంభాషణ చదువుతున్న వినోద్ కొద్దిసేపు ఆగి, కథ ఇలా ఉందేమి అనుకుని మిగితాది గబగబా చదువుతున్నాడు వినోద్.

రెండు నెలలకు ముందు అని కథలో ఫ్లాష్ బ్యాక్ స్థూలంగా ఇలా ఉంది.

ఇల్లు అమ్మేసి వచ్చిన భీమారావు, సుశీలలను నాలుగు రోజులు బాగానే చూసుకున్న కూతురు శృతి, అల్లుడు వినోద్ ఇంటి పనంతా వారి మీదేసి అది శుభ్రంగా లేదు, ఇది రుచిగా వండలేదు అంటూ చిరాకు పడడం మొదలెట్టారు. భీమారావుకు జ్వరమొస్తే హాస్పిటల్ కు ఎందుకు.. ఆన్ లైన్ లో డాక్టర్లు కావలసినంత మంది దొరుకుతారు అని ఓ డాక్టర్ తో వీడియో కాల్ లో మాట్లాడించి ట్రీట్ మెంట్ ఇప్పించారు. డాక్టర్ దగ్గరికి తీసికెళ్తే టెస్టులు చేసి రెండ్రోజుల్లో తగ్గే జ్వరం ఫోను చికిత్సతో వారం రోజులు వాంతులు విరేచనాలై భీమారావును సగం చేసింది. భర్త బాధ చూడలేక సుశీల ఇదేం పద్ధతి అని కాస్త గట్టిగానే అడగడంతో అల్లుడు విసుక్కోవడం, అమ్మాయి మాట్లాడడం మానేయడం మొదలై, ఆ ముసురు గాలివానై ముసలాళ్ళని రోడ్డు మీదికి తెచ్చింది. తిరిగి తమ ఊరికి వెళ్లేందుకు ముఖం చెల్లక సొంతూరికి దగ్గర్లోని పట్టణంలో కిరాయి ఇంట్లో ప్రస్తుతం కాలం గడుపుతున్నారు.

వినోద్ కథ చదవడం ఆపి 'శ్రుతీ!' అని గట్టిగా పిలిచాడు.

కిచెన్ లోంచి హడావుడిగా వచ్చిన శృతి 'ఏంటండీ! నాకు చెవులు వినబడనట్లు అంత గట్టిగా పిలిచారు' అంది.

'ఈ పత్రికలో కథ చదువు. అచ్చం మన కథలాగే ఉంది. మీ నాన్నే ఎవరికో చెప్పి ఈ కథ రాయించాడు' అన్నాడు ఊగిపోతూ.

'ఏమంటున్నారు. మా నాన్నకు రచయితలెవరు తెలియరు' అంది శృతి పత్రికను చేతుల్లోకి తీసుకుంటూ.

'అయితే ఆయనే రాసుంటాడు' అన్నాడు వినోద్ ఊపు తగ్గకుండానే.

'మా నాన్న కథ రాస్తే పత్రికవాళ్ళు వేసుకుంటారా!' అని కథలోకి వెళ్ళింది.

కొంచెం చదివాక ఆమె 'ఈ రోజుల్లో పిల్లల చేతుల్లో మోసపోతున్న తల్లిదండ్రుల గురించి ఎన్నో కథలు వస్తున్నాయి. అందులో ఇదోటి. అంతే. మీరేదో అనవసరంగా ఊహించుకొని బిపి పెంచుకుంటున్నారు' అంటూ చదివింది చాలన్నట్లు పుస్తకం పక్కన పెట్టి వంటింటి వైపు నడిచింది.

'భీమారావు, సుశీల మీ అమ్మ నాన్నల పేర్లే కదా.. వినోద్, శృతి మన పేర్లే కదా.. అదంతా మన ఇంట్లో జరిగిందే కదా! పోయేది పోకుండా మీ అమ్మ నాన్నలు మన పరువు తీయాలనుకున్నారు' అన్నాడు కోపంగా.

వెనక్కి వచ్చిన శృతి పత్రికను మళ్ళీ తిరిగేసి 'ఔను కదా.. కథలో మన పేర్లు ఉన్నాయేంటి!' అంటున్నఆమె మెదడు మొద్దుబారింది. జరిగింది జరిగినట్లు పేర్లతో సహా పత్రికలో కథ రావడం ఆమెకు నమ్మశక్యంగా లేదు. అక్షరాలా నిజం అక్షరాల్లో కనబడుతోంది. అమ్మ నాన్నలు కథ రాసే అవకాశమే లేదు. కల్పనలో ఇంత వాస్తవం కూడా ఉంటుందా.. అనుకుంటూ పుస్తకంలో పేజీలు తిప్పి రచయిత పేరు చూసింది. రాము అని ఉంది.

'మనకు ఈ రాము ఎవరో తెలిస్తే ఇది ఎవరి కథ అని, ఇదంతా నీకెలా తెలుసనీ అడగొచ్చు' అంది వినోద్ తో.

'కథ రాసిన వారి ఫోటో, ఫోన్ నెంబర్ ఇస్తూ ఉంటారు కదా!'

'కొన్ని పత్రికలు ఇస్తుంటాయి కానీ ఇందులో పేరు తప్ప ఏమి లేదు'

'వేసే పత్రికవాళ్లను కూడా వీడు వదనేవాడేనేమో!' అన్నాడు ఆక్రోశంగా.

ఈ రచయిత ఎవరై ఉంటారు, దగ్గరి బంధువుల్లో కథలు రాసేవాళ్లెవరైనా ఉన్నారా ముసలాల్లే ఎవరికైనా చెప్పి రాయించారా అనే పరిపరి విధాల ఆలోచనలతోనే వారి ఆదివారం గడిచింది.

మర్నాడు డ్యూటీకి వెళ్లి వస్తూ వినోద్ ఆ పత్రిక ఆఫీసు ముందు ఆగాడు. లోపలికి వెళ్ళనిస్తే స్టోరీ సెక్షన్ లో ఆ కథ రాసినతను ఎవరో తెలుసుకోవచ్చు అనుకున్నాడు.

'గేటు ముందు నుంచి బండి తీయండి సార్!' అన్నాడు సెక్యూరిటీ.

ఆ పక్కన బైక్ ఆపి 'సండే స్టోరీ సెక్షన్ వారిని కలవాలి' అన్నాడు ఆయనతో.

'లోపలికి వెళితే రిసెప్షన్ ఉంటుంది. అక్కడ పర్మిషన్ ఇస్తే కలవచ్చు' అని ఓ బుక్ లో వినోద్ తో వివరాలు రాయించి పోనిచ్చాడు.

రిసెప్షనిస్టు శాంతంగా వినోద్ చెప్పింది విని ఇంటర్ కమ్ లో సెక్షన్ వారితో మాట్లాడింది.

కొద్దిసేపటికి ఒకాయన కథ రాసి ఉన్న కాగితాలను తెచ్చి వినోద్ కు చూయించాడు.

'రచయిత ఫోన్ నెంబర్ కానీ, అడ్రస్ కానీ కావాలి' అన్నాడు కాగితాలు తిరిగేస్తూ.

'ఫోన్ నంబర్ ఇవ్వలేదు. అడ్రస్ చివరన రాశాడు' అంటూ వేలు పెట్టి చూయించాడు.

అడ్రస్ చూడగానే వినోద్ ఇది నిజమా అని నమ్మనట్లు మళ్ళీ మళ్ళీ చూశాడు. అందులో ఉన్నది తమ పక్క ఫ్లాట్ అడ్రసే. ఆ అడ్రస్ ను ఫోన్లో ఫొటో తీసుకుని థాంక్స్ చెప్పి బయటికొచ్చాడు.

తన ఇంటికి వెళ్లకుండా ముందుగా అడ్రస్ లో ఉన్న పక్క ఫ్లాట్ కాలింగ్ బెల్ కొట్టాడు.

తలుపు తీసిన ప్రకాష్ 'మీరు పక్క ఫ్లాట్ వారు కదా.. లోపలికి రండి!' అన్నాడు వినోద్ తో మర్యాదగా.

'లోపలికి వచ్చే మాట తర్వాత కానీ ముందు రామును పిలవండి!'

'మా ఇంట్లో రాము అనేవారు ఎవరు లేరు. నా పేరు ప్రకాష్. మా నాన్న పేరు ముకుందం'

వినోద్ తాను ఫోన్లో తీసిన చిరునామా ఫొటో చూయించి 'మీ అడ్రస్ నుండే పత్రికకు ఈ కథ వెళ్ళింది' అంటూ లంచ్ బ్యాగ్ లోంచి పత్రికను తీసి కథను చూయించాడు.

'ఆ కథను నేను కూడా నిన్న చదివాను. బాగుంది. దీంతో మీకేమి ప్రాబ్లమ్' అన్నాడు ప్రకాష్.

'కథ ఎలా ఉంది అని అడగడానికి రాలేదు. కథ ఈ అడ్రస్ నుండే వెళ్ళింది కాబట్టి రాము అనే ఆయన మీ ఇంట్లో ఉండాలి. కథలో మా పేర్లు వాడినందుకు ఆయనపై స్టేషన్లో పిటిషన్ ఇచ్చి, పరువు నష్టం కింద లీగల్ నోటిస్ ఇప్పిస్తాం' అన్నాడు తీక్షణంగా చూస్తూ.

'ఇచ్చుకోండి! ఆ పేర్లు మీ ఒక్కరికే ఉంటాయా.. ఎవరో మా అడ్రస్ వాడినంత మాత్రాన మేము దొంగలమై పోతామా?' అన్నాడు ప్రకాష్ విసుగ్గా.

'అదేదో కోర్టులో చెప్పుకోండి!'అంటూ సరసరా వెళ్ళిపోయాడు వినోద్.

తలుపేసి సోఫాలో కూచున్న ప్రకాష్ తల వెనక్కి వాల్చి నిన్న చదివిన కథంతా ఓసారి మననం చేసుకున్నాడు. పేర్లకే ఇంత ఎగురుతారా ఎవరైనా.. కథ కూడా వీరిదే అయి ఉండొచ్చు. నాన్న కూడా ఈ కథ చదివాడు. సండే బుక్ కనబట్టం లేదంటే తన లా బుక్స్ మధ్యలోంచి తీసిచ్చాడు అని తట్టగానే ప్రకాష్ లేచి తండ్రి గదిలోకి వెళ్ళాడు.

ముకుందం మంచం పైన ముసుగు తన్ని ముడుచుకు పడుకున్నాడు. పక్కన చదువుతున్న పుస్తకం బోర్లేసి ఉంది.

'నాన్నా.. పడుకున్నారా!' అన్నాడు ప్రకాష్ మెల్లగా.

ముసుగు తీయకుండానే 'ఊ..' అన్నాడు.

'ఒకసారి మీ పూర్తిపేరు చెప్తారా!'

'రాచకొండ ముకుందం'

'రాము అనేది మీ పొట్టి పేరా.. ముందు ఆ ముసుగు తీయండి!' అన్నాడు కోపంగా ప్రకాష్.

ముసుగు తీసి బెడ్ మధ్యలో తల దించుకొని కూచున్నాడు.

'ఎందుకు నాన్నా మనకీ చిక్కులు. మీరు ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు రాసిన కథలతో పడ్డ తిప్పలు చాలవా. అప్పుడు ఆర్ ఎమ్ పేరుతో చాటుగా రాసి ఇప్పుడు రాముగా అవతారమెత్తారా! అడ్రస్ లో ఉన్న చేతివ్రాత చూడగానే నాకంత అర్థమై పోయింది. పక్కాయన పరువు నష్టం దావా వేస్తాడట.' అన్నాడు ప్రకాష్ మంచంపై ఓ పక్కన కూచుంటూ.

'నేను అడ్వొకేటునే. నేనే రాశానని చెప్పి వాదిస్తాను' అన్నాడు తల ఎత్తి.

ప్రకాష్ భార్య భారతి కూడా ఆ కథ చదివింది. వినోద్ వచ్చిన విషయాన్నీ గమనించింది. తండ్రి కొడుకుల వాదన వినరాగానే అటువైపు వచ్చింది.

ఆమెను చూసిన ప్రకాష్ 'చూశావా భారతీ! నిన్న కథ చదివి లోకంలో జరుగుతున్నదే రాశారు అని మనం అనుకున్నామా.. ఆ కథ రచయిత మనింట్లోనే ఉన్నాడు' అన్నాడు తండ్రి వైపు చేయి చూపిస్తూ.

కోడలు మొహం చూడలేక ఎత్తిన తల మళ్ళీ దించుకున్నాడు ముకుందం ఉరఫ్ రాము.

'మామగారి బాత్ రూమ్ లోకి పక్కింటి ముచ్చట్లన్నీ వినిపిస్తాయి. ఆ ముసలాళ్ళ బెడ్ రూమ్ కిటికి వీరి బాత్ రూమ్ వెంటిలేటర్ కు ఎదురుగా ఉంటుంది. వాళ్లు కిటికీ తెరిస్తే అక్కడి మాటలన్నీ ఫుల్ వ్యాల్యుమ్ లో వినొచ్చు. అలా కిటికి తనకు చెప్పిన కథను మామగారు లోకానికి చెప్పారన్నమాట' అంది భారతి.

ముకుందం కాస్త తల ఎత్తి కోడలు వైపు గుర్రుగా చూశాడు.

★★ ★★ ★★

ఇంట్లో కాలు పెట్టగానే వినోద్ తో 'దారి తప్పి పక్కింటి బెల్ కొట్టినారా ఏంటి?' అంది శృతి.

'బెల్ కాదు. వీపులు పగల కొట్టాలి. నిన్నటి కథ రాసింది పక్క పోర్షన్ వాళ్లే!' అన్నాడు పళ్ళు కొరుకుతూ.

'నిజమా.. ఇదెక్కడి పద్దతి. పక్కనే ఉండి పరువుతీస్తారా.. నేనడిగొస్తానుండండి!' అంటూ తలుపు తీసింది శృతి విసురుగా.

'ఆగాగు. అట్లాకాదు వాళ్లకు బుద్ది చెప్పాల్సింది. వకీలు, పోలీసులే వీరికి తగినోళ్ళు..' అంటూ తన అడ్వొకేట్ ఫ్రెండ్ సుబ్బారావుకు ఫోను కలిపాడు. ఆయన వినోద్ చెప్పిందంతా విని 'నేను ఊర్లో లేను. వారం తరవాత వస్తాను, రాగానే లీగల్ నోటిస్ ఇచ్చి స్టేషన్లో కంప్లైంట్ చేద్దాం. డోంట్ వర్రీ' అని పెట్టేశాడు.

వినోద్ మొబైల్ ను పక్కన పెడుతూ 'వారం ఆగితే ఆ ముసుగు రాము బయటపడతాడు' అన్నాడు ధీమాగా.

'అది నిజమే కానీ ఆ పేర్లు మీవే అయితే ఆ కథ కూడా మీదేనా అని ఎవరైనా అడిగితే ఏం సమాధానం చెప్తాం. విషయం పెకిలిస్తే మన పరువు మరింత బజార్లో పడ్తది. చూసి చూడనట్లు ఊర్కోవడమే ఉత్తమం' అంది శృతి భర్తతో.

'అదంతా మన అడ్వొకేట్ సుబ్బారావు చూసుకుంటాడు. ఏదో గుణపాఠం నేర్పకపోతే ఎలా?' అన్నాడు వినోద్.

'అది కాదండీ.. కథ చివర్లో ఏముందో చూశారా.. మనకు ఇచ్చిన సొమ్మును ఏదో సెక్షన్ల ప్రకారం వెనక్కి ఇప్పించినట్లుంది. మబ్బులు వీడితే మనకే కష్టం' అంది శృతి ఇదంతా ఇష్టం లేనట్లు.

'ఎలా వీడుతాయో నేనూ చూస్తాను' అనుకుంటూ శృతి జవాబు కోసం చూడకుండా షార్ట్ వేసుకొని బాత్ రూములోకి వెళ్లాడు.

అడ్వొకేట్ సుబ్బారావు రాక మరింత ఆలస్యం కావడంతో వినోద్ లో బింకం తగ్గి వారి ఇంట్లో ఆ సంగతే మరిచినట్లయింది.

అలా నెల రోజులు గడిచాక వినోద్ పేరు మీద లీగల్ నోటిస్ వచ్చింది.

ఇదేపనిలో తానుంటే తనకే నోటీసేమిటని విప్పి చూశాడు.

మామ భీమారావు తరపున అడ్వొకేట్ పంపించిన నోటీసు అది. ఫ్లాట్ కొనే ముందు మా క్లయింట్ నుండి తీసుకొన్న మొత్తం వెంటనే చెల్లించకుంటే మీపై కోర్టులో దావా వేసి వసూలు చేయవలసి ఉంటుంది అని దాని సారాంశం. ఆయన ఖాతాకు డబ్బులు ట్రాన్స్ ఫర్ అయిన బ్యాంక్ స్టేట్ మెంట్ కాపీ జతపరచి ఉంది. చివర్న ముకుందం అడ్వొకేట్ అని ఉంది.

ఈ పేరు ఎక్కడో విన్నాను, చూశాను అని బయటకొచ్చిన వినోద్ పక్క ఫ్లాట్ ప్రకాష్ తలుపు పక్కన ఉండే చిన్న సైన్ బోర్డు కోసం వెదికాడు. కనబడలేదు. బోర్డు పీకేసిన గుర్తు గోడపై ఉంది. ఇక్కడే ముకుందం ఫ్రీ లీగల్ సర్వీస్ అని బోర్డు ఉండేది. వీడి మీద కేసు వేద్దామంటే ఉల్టా వీడే మనకు నోటిస్ పంపాడేమిటి అనుకుంటూ కోపంగా బెల్ నొక్కాడు.

ఎవరూ రాకపోయేసరికి తలుపు గొళ్ళెం వైపు చూశాడు. చిన్న తాళమేసి ఉంది.

సరాసరి అపార్ట్ మెంట్ ఆఫీసుకు వెళ్లి ఫ్లాట్ ఓనర్ నంబర్ తీసుకోని ఫోను చేశాడు.

'వాళ్ళు ఖాళీ చేసి వారం రోజులైంది' అని జవాబు వచ్చింది.

'ఎక్కడికెళ్లారో తెలుసా?'

'ఆయన బ్యాంకులో పనిచేస్తాడు. ప్రమోషన్ పై ఏదో టౌన్ కు ట్రాన్స్ ఫర్ అయిందన్నాడు'

'థాంక్స్' అంటూ ఫోన్ పెట్టేశాడు.

వినోద్ విసురుగా అందించిన నోటీసు చూడగానే శృతికి కోపం ఆగలేదు. వెంటనే తల్లికి ఫోన్ చేసి 'ఈ కథ ఏంటి.. ఈ నోటీసు ఏంటి.. అసలు మీరు నా తల్లిదండ్రులైనా?' అంది.

'అవునో కాదో నీవే చెప్పాలి. మేముండే ఇంటి పై పోర్షన్లోకి ఈ అడ్వొకేట్ ఫ్యామిలీ దిగారు. ముకుందంగారు మమ్మల్ని గుర్తు పట్టి మీ చిక్కులనే కథగా రాశాను. అందులో రాసిందే జరుగుతుంది అన్నాడాయన' అని సుశీల ఫోన్ పెట్టేసింది.

★★★

COMMENTS